

# బాట వేసే పాదాలు

**1990**వ సంవత్సరం, జూలై ఆరవ తేదీ.

మధ్యాహ్నం, రెండు గంటలా యాభై నిమిషాలు-

డిప్లొమా, మెకానికల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ తరగతి గది - లెక్చర్‌హాల్ నంబర్ ఐదు..,

బయట సన్నగా వర్షం... తుంపర,

తరగతి గది నిండా మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఓ డెబ్బయిదాకా, అమ్మాయిలూ, అబ్బాయిలూ, వీళ్ళుగాక ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, సివిల్ విద్యార్థులు ఓ నలభై మందిదాకా స్పెషల్ పర్మిషన్ తీసుకుని పాఠం వినేందుకు హాజరై.,

'ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' సబ్జెక్ట్,

ఆ విద్యాసంవత్సరం మొదటి క్లాసు, వరుసగా రెండు పీరియడ్లు, రెండూ యాభైనుండి నాలుగున్నర వరకు. తర్వాత చుట్టీ.

తరగతిగది కమ్ముకున్న మేఘాలు నిండిన ఆకాశంవలె దట్టంగా, నిండుగా, గంభీరంగా ఉంది.

అంతా నిశ్శబ్దం..క్రమశిక్షణ, ఉత్కంఠ, ఉత్సుకత నిండిన నిశ్శబ్దం.

ఒక ఎదురుచూపు...వర్షంకోసం భూమివలె.

'ఇటీజ్ ద టైం–నౌ కమ్స్ ద లయన్' ఒక విద్యార్థి ప్రక్కనున్న వాడితో గుసగుసగా అన్నాడు వాచ్ చూచుకుంటూ.

బయటా, తరగతిగదిలో వాతావరణం ప్రశాంతంగా ఉంది. నిశ్శబ్దంగా ఫాన్లు తిరుగుతున్నాయి. ఎదురుగా విశాలమైన గ్లాస్‌బోర్డ్ ఎదురుచూస్తోంది.

సరిగ్గా..అప్పుడొచ్చాడు..మౌళి సార్..ఆకాశంలోకి సూర్యునివలె.

విద్యార్థులు గౌరవంగా, నిశ్శబ్దంగా లేచి నిలబడ్డం..ఒక సైగతో మళ్ళీ ఎక్కడివాళ్ళక్కడ వినమ్రంగా కూర్చోవడం..జరిగి,

"మైడియర్ ఫ్రెండ్స్.."

ఒక వాత్సల్యపూరిత సంబోధన..పూలను గాలి తాకినట్టు స్పర్శ.

"మనం ఈ రోజు ఒక అద్భుతమైన సబ్జెక్టును ఆరంభం చేయబోతూ మన జీవితాలను ఒక కొత్త కోణంలో దర్శించడం నేర్చుకోబోతున్నాం...ఈ క్షణం నుండి మీకు ఒక కొత్త చూపు అలవడబోతున్నది.."..ఇంగ్లీష్‌లో.,

...నిశ్శబ్దం...ఉత్సుకత.

"మేనేజ్‌మెంట్, ఎంట్రప్రెన్యూర్...యివి రెండూ ఉత్కృష్టమైన రెండు అద్భుత పదాలు. అంటే నిర్వహణ, ఔత్సాహికుడు..ఏమిటివి.. సెల్ఫ్ మేనేజ్‌మెంట్ – ఆత్మనిర్వహణ, టైం మేనేజ్‌మెంట్–సమయ నిర్వహణ. యిలా మనిషి తనను తాను, సమయాన్ని తాను, సమాజాన్ని తాను, మానవ వనరులను తాను.. నిర్వహించడాన్ని అధ్యయనం చేస్తూ.." కొద్ది నిముషాలు సాగి, ఆగి,

"ఇప్పుడు ఒక ఐదుగురు విద్యార్థులను ఒకే ఒక ప్రశ్న వేస్తాను... అప్పుడు మీకు మీ గురించి తెలియడం ప్రారంభమౌతుంది" అని మౌళి సార్ ఒక విద్యార్థిని ఉద్దేశించి అడిగాడు.

"అమ్మా..నువ్వు ఈ డిప్లొమా తర్వాత ఏంజేస్తావ్" అని.

ఆ అమ్మాయి లేచి నిలబడి "సార్ ఈసెట్ రాసి, బిటెక్ చేసి తర్వాత ఉద్యోగం చేస్తా సార్."

"గుడ్, సిడౌన్..నువ్వు చెప్పవయ్యా..ఏంజేస్తావ్ డిప్లొమా తర్వాత" యింకో విద్యార్థిని ప్రశ్న.

"సర్, నేనూ అంతేసార్. బిటెక్ తర్వాత ఎమ్‌టెక్ చేసి ఉద్యోగం చేస్తా సర్".

"గుడ్..సిడౌన్..నువ్వు" యింకొకరిని,

"సేమ్ సర్, బిటెక్, ఎమ్‌టెక్ – ఉద్యోగం. వీలుంటే స్టేట్స్‌కు పోతా."

"గుడ్...సిడౌన్..నువ్వు చెప్పవయ్యా"

"ఈ దేశంలో బిటెక్ చేసినా అదే ఉద్యోగం, ఎమ్‌టెక్ చేసినా అదే ఉద్యోగం. వేస్టాఫ్‌టైం. బిటెక్ కాగానే ఉద్యోగంలో చేరి తర్వాత పార్ట్‌టైం ఎమ్‌టెక్ చేస్త సర్".

"గుడ్...నెక్స్ట్..."

ఎనిమిది మంది..ప్రతిస్పందన...దాదాపు అందరూ ఒకటే,

మౌళి సార్ అన్నారు "అంటే మీరందరూ కూడా డిప్లొమా ఐపోగానే బిటెక్ చేస్తారు. వీలుంటే ఎమ్‌టెక్ కూడా చేస్తారు..ఐతే అందరూ చివరికి ఉద్యోగం మాత్రం తప్పకుండా చేస్తారు..ఔనా.."

"ఔన్సార్" - ఐదారుగురన్నారు.

"రైట్... ఐతే మీ అందరికి ఉద్యోగం ఎవరివ్వాలి. అంటే మీరు బిటెక్ పాసయ్యేనాటికి మీకోసం ఎవడో, ఎక్కడో ఒక ఉద్యోగాన్ని సృష్టించి మీకోసం సిద్ధంగా ఉంచితే మీరు వెళ్ళి అందులో చేరి ఉద్యోగం వెలగబెడ్తారు. అంటే మీరు ఒకరిపై ఆధారపడి ఉద్యోగాన్ని పొంది మీ శేషజీవితాన్ని ఒక ఆధారిత వ్యక్తిగా గడపదలుచుకున్నారు. స్వతంత్రంగా జీవించాలని కనీసం మీరు అనుకోనైనా అనుకోవడంలేదు. ఉద్యోగాన్ని ఎవరోఒకరు మనకు యివ్వడమేమిటి, కావలిస్తే నాకు నేను నాస్వంత కాళ్ళపై నిలబడి నేనే వేరొకరికి ఉద్యోగాన్నిస్తాను అని కనీసం మీరు ఆలోచించడంలేదు. మిమ్మల్ని మీరు ఒక డిపెండెంట్‌గా కాకుండా, ఎవరో ఇస్తే ఆ ఉద్యోగాన్నిచేసే వ్యక్తిగా కాకుండా స్వతంత్రంగా ఉద్యోగాలను సృష్టించే వ్యక్తిగా ఈ క్షణంనుండి ఊహించుకోండి. మీకు మీరే ఒక కొత్త వ్యక్తిగా కనబడ్డం మొదలౌతుంది. ఒక కొత్త ఉత్తేజం మీలో ఉరకలెత్తుతుంది. మీరు ఒక పనిచేసే వ్యక్తినుండి పనిని సృష్టించే వ్యక్తిగా ఎదుగుతారు.."

మాటలు ఈటెలై దిగుతున్నాయి.

నిశ్శబ్దం ఆలోచనలను విరజిమ్ముతూ అందరి ముఖాల్లో వింతకాంతిని పూయిస్తోంది.

అక్కడ ఒక 'తరం' తయారుకావడం ప్రారంభమైంది.

మొక్కల్లాంటి పసిమెదళ్ళు 'ఆలోచించడం' మొదలెట్టాయి- వాళ్ళందరూ నడక మొదలుపెట్టబోయే ముందు ఎత్తబోయే పాదాల్లా ఉన్నారు.

## 2

అదే రోజు...

అదే తరగతి గదిలో.. అదే క్లాసులో.,

బయట సన్నని వర్షం కురుస్తూనే ఉంది... తుంపర.

సమయం... సాయంత్రం నాలుగూ ఇరవై ఐదు నిముషాలు

మౌళి సార్ చెబుతున్నారు..."అందరూ రాసుకోండి కాపీల్లో...మనిషి అవసరాలను, బలహీనతలను, అనివార్యతలను నగదుగా మార్చుకోవడమే వ్యాపారం" అని.

అందరూ వినమ్రంగా ఆ ప్రవచనాన్ని మంత్రముగ్ధులై రాసుకుంటున్నారు శిశుతరగతి పిల్లల్లా.

''మీరు ఈ స్టేట్‌మెంట్‌ను జీవితకాలమంతా మననం చేసుకుంటూండాలి. ఎందుకంటే దీని అర్థం మీ వయస్సు పెరుగుతున్నకొద్దీ కొత్తగా, వింతగా, సందర్భాన్నిబట్టి ఒక అద్భుతంగా అర్థమౌతూంటుంది.."

అంతా నిశ్శబ్దం.

"ఇపుడు నేను మీకొక హోంవర్క్ యివ్వబోతున్నాను. ఎవరూ కాపీల్లో రాసుకోవద్దు. కేవలం నేను చెప్పబోయే ప్రాబ్లంను శ్రద్ధగా విని, లోతుగా అర్థం చేసుకుని ఈ రోజు రాత్రి పడుకునే ముందు బెడ్‌పై కూలంకషంగా, దీర్ఘంగా ఆలోచించి - రేపు మళ్ళీ యిదే క్లాస్‌లో సమాధానం చెప్పాలి. ఓకే"

"ఓకే సర్"

"నువ్వు ఈరోజు యింట్లోనుండి కాలేజికి బయల్దేరుతున్నపుడు మీ అమ్మ సడెన్‌గా గేట్‌దగ్గర ఎదురై, నీ జేబులో ఉన్న కొద్దిపాటి రూపాయలు, చిల్లరా లాక్కుని..పోరా..ఈ క్షణం నుండి యిక ఈ యింటికి రావద్దు. ఎక్కడికన్నా పో. నీ ముఖం చూపించొద్దు మాకు. గెటౌట్-అని అంది. ఈ సడెన్ షాక్‌కు అప్రతిభుడవై, రోషంతో బయటికొచ్చావు. కాలేజికి రావడానికి బస్సుకిరాయి లేదు..రోడ్డుపైకొచ్చావు...నిలబడ్డావు.. దిక్కులు చూస్తున్నావు..ఆలోచిస్తున్నావు.. ఆ తర్వాత ఏం జేశావు. కాలేజికి ఎలా వచ్చావు.ఎక్కడ లంచ్ చేశావు..ఆ సాయంత్రం, ఆ రాత్రి..ఏంజేస్తావు...ఇక ఆ తర్వాత..విచారణజేయండి... విశ్లేషణచేయండి యింకా యింకా..చివరికి మీరు ఏంజేస్తారు..యిదీ ఈనాటి మీ హోంవర్క్ రేపు మీరందరూ చాలా నిజాయితీగా సమాధానం చెప్పాలి.. బై..గుడ్‌లక్"

అంతా నిశ్శబ్దమే.

ఆలోచించడం మొదలై..కొనసాగుతూంటే,

మౌళి సార్ వెళ్ళిపోయారు.

"ద లయన్ హేజ్ గాన్" ఎక్కడినుండో వినబడింది.

అంతా గంభీర ఉద్విగ్నత.

## 3

మర్నాడు,

అదే తరగతి గదిలో-

బయట వర్షం లేదు. అంతా ప్రశాంతంగా ఉంది.

విద్యార్థులందరూ వేకువకోసం చీకటివలె ఎదురుచూస్తున్నారు.

మౌళి సార్ రానే వచ్చారు - అడవిలోకి మృగరాజువలె.

గంభీరమైన గొంతు, ప్రసన్న వదనం "నిన్నటి హోంవర్క్ గురించి అందరూ సీరియస్‌గా, నిజాయితీగా ఆలోచించారనే అనుకుంటున్నాను. ఎవరైనా ఒకరు స్వచ్ఛందంగా లేచి నిలబడి జవాబు చెప్పండి".

మౌళి సార్ భక్తుల ముందు దైవ విగ్రహం వలె,

విద్యార్థులందరిలోనూ ఒక అంతస్సంఘర్షణ....ఒక నిస్సహాయత....ఒక స్పష్టమైన వ్యాకులత....అంతా నిశ్శబ్దం...తర్జన భర్జన.

ఎవరూ లేచి నిలబడరు.

అంతా మౌనం...

ఒకటి..రెండు...మూడు....ఐదు నిముషాలు.

చివరికి మొదటి బెంచిలో కె. మధుసూదన్ లేచి తలవంచుకుని నిలబడ్డాడు.. నిశ్శబ్దంగానే. కాని జవాబు చెప్పడం లేదు.

" చెప్పు..నీ జవాబేమిటి?"

...........మౌనం

"కమాన్ టెల్‌మీ.... ఏంజేస్తావ్ అ పరిస్థితిలో"

"..........."

"స్టెప్ బై స్టెప్ విచారణ చేసుకుంటూ వెళ్ళాలి ముందుకు....కమాన్ చెప్పు...ఏంజేస్తావ్"

"సార్....." అనూహ్యంగా ఆశ్చర్యం కల్గిస్తూ మధుసూధన్ భోరుమని ఏడ్చాడు. దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చిందతనికి. వెక్కెక్కిపడి ఏడుస్తున్నాడు...కన్నీళ్ళు టపటపా రాలాయి.

అందరూ అవాక్కయి...అప్రతిభులై...కుంచించుకుపోయి...

"నో...మైబాయ్ ...డోంట్ వీప్...ఏడ్వద్దు...నీ స్పందన చెప్పు. నువ్వు నిజాయితీగా పరిస్థితిని విశ్లేషించావు కాబట్టి...నీకు దుఃఖం ముంచుకొస్తోంది...చెప్పు చెప్పు..." సార్ వేదిక దిగి మధుసూదన్ తలను స్పర్శించారు.

"సర్..." మధుసూదన్ చెప్పడం ప్రారంభించారు. "అమ్మ డబ్బులు లాక్కుందిగద సార్...ఉదయం నడచి కాలేజికి రావడం వల్ల గంట లేటైంది. సార్లు తిట్టారు. పాఠం పోయింది..మధ్యాహ్నం లంచ్ లేదు- క్యాంటిన్‌కు వెళ్దామంటే డబ్బుల్లేవు. టాప్ దగ్గర మంచినీళ్ళు తాగాను. సాయంత్రం నాలుగున్నరకు కాలేజి విడిచిపెట్టారు. వెళ్ళడానికి యిల్లు లేదు. అమ్మ రావద్దంది కదా. జేబులో పైసాలేదు. ఎక్కడికెళ్ళాలిప్పుడన్న ఆలోచన మెదడులో మండుతున్న నిప్పుకణికవలె..లోపల పౌరుషం...ఏదో ఒకటి చేయాలి..ఎవరైనా ఫ్రెండ్ రూమ్‌కు వెళితే..హోంవర్క్

ప్రకారం వాడూ నాలాంటివాడేకదా...రోడ్లవెంట హోర్డింగ్స్ చూచుకుంటూ ఊరంతా తిరిగాను..పార్క్‌కు పోయి కూర్చున్నాను. కడుపులో ఎలుకలగోల.. ఆకలి..శరీరంలో నిస్సత్తువ...క్రమంగా ఆవరిస్తున్న నిస్సహాయత...పొటమరిస్తున్న భయం.ఏంచేయాలిప్పుడు..ఎక్కడికెళ్ళాలిప్పుడు...చీకటి పడ్తోంది.ఎక్కడ పడుకోవాలి..ఎక్కడ భద్రత...ఎవరు దిక్కు... ఎవరు ఆదుకుంటారు.పార్క్‌నుండి బస్టాండ్..అక్కడ కాసేపు అక్కడ కాసేపు కూర్చుని...ఎవరో ఏదో అడుగుతారు.. చికాకు..అసహనం...పెరుగుతున్న ఆకలి..విస్తరిస్తున్న భయం. దిక్కుతోచని స్థితి.. రాత్రి పదకొండయింది. బస్టాండ్ నిర్మానుష్యం..తనిక ఈ ఒంటరి ప్రపంచంలో ఏ దిక్కులేనివాడు. యిప్పుడేం జేయాలి. ఎక్కడ పడుకోవాలి. సిమెంట్ చప్టాపై ముడుచుకుపడుకోవాలా. ప్రక్కన ఓ గజ్జికుక్క...పన్నెండు దాటినాక..బీట్ పోలీస్‌లు...నిద్రలో కునికిపాట్లు పడ్తూండగా..పిర్రలపై రెండు లాఠీదెబ్బలు. ఎవడాబే సాలే..ఏంజేస్తానవిక్కడ...ఏడికి పోవాల్రా..మావోయిస్టవా..ఏ దళం నీది. ...నడువ్ సాలే పోలీస్‌స్టేషన్‌కు-గద్దింపు...వీపుపై టపటపా దెబ్బలు. అడ్రస్ చెప్పు బాడ్‌కొ..శరీరమంతా వెదుకులాట మెడపట్టి గెంటుకుంటూ...సర్... ఊహించలేనిక...అంతా చీకటి, దిక్కులేనితనం...అంతా అంధకారం..అమ్మనాన్న లేకుండా, యిల్లులేకుండా...ఎక్కడికని పోగలను నేను..ఎక్కడ బతగ్గలను నేను... ఒక్కరోజుకూడా..సార్..ఐ కాంట్..తల్చుకుంటే భయం చంపేస్తోంది సార్..." మధుసూధన్ చెప్పి చెప్పి అకస్మాత్తుగా ఆగి...

తరగతి గదంతా నిశ్శబ్దం..

వెక్కెక్కి పడ్తున్న ఏడుపు చప్పుడు.

సార్ ఇంకో అమ్మాయిని లేపి అదే హోంవర్క్ యొక్క జవాబు అడిగారు. ఆ అమ్మాయి మధుసూదన్‌వలె ఏడ్వలేదు గాని దాదాపు అదే సమాధానం చెప్పింది.

మరొకరికి అదే ప్రశ్న.

....మళ్ళీ అదే జవాబు.

మౌళి సార్ అన్నారు..." మీరందరు యిప్పుడు ఒక సత్యాన్ని గ్రహించి మీ హృదయంలో అండర్‌లైన్ చేసుకోవాలి. అదేమిటంటే మిమ్మల్నందర్ని మీ తల్లిదండ్రులు తల్లికోడిపెట్ట తన రెక్కలకింద పిల్లల్ని దాచుకున్నట్టు దాచుకుని సంరక్షిస్తున్నారు. ప్రతిదినం, రాత్రీ, పగలు..అనుక్షణం..మీ తల్లిదండ్రులు మిమ్మల్ని కంటికి రెప్పలకన్నా మిన్నగా మిమ్మల్ని కాపాడుతున్నారు.వాళ్ళు లేకుండా, మీకంటూ ఒక యిల్లు లేకుండా మీరు క్షణం కూడా జీవించలేరు.ఈ సమాజంలో మీకు భద్రత లేదు. కాగా...మీరు ఎంత డిపెండెంటో మీకిప్పుడు సంపూర్ణంగా బోధపడ్డది. కాబట్టి ఈ 'డిపెండెంట్' స్థితినుండి మీకు మీరు మీ ఆత్మ నిర్వహణతో, ఆత్మవిశ్వాసంతో ఒక 'ఇండిపెండెంట్' వ్యవస్థగా

ఎదగాలి...మిమ్మల్ని మీరు పునః నిర్మించుకోవాలి..పాఠం ప్రారంభమైంది.

అక్కడ ఆ క్షణం జ్ఞానవినిమయం జరుగుతోంది..నిశ్శబ్దంగా.

అర్ధరాత్రి...తడిమట్టిలోనుండి మొక్కల వ్రేళ్ళు నీటి జలను నిశ్శబ్దంగా, జీవంగా, ప్రాణంగా స్వీకరిస్తున్న దృశ్యమది-

## 4

2006 వ సంవత్సరం, జనవరి ముప్పది ఒకటవ తేదీ.

రాత్రి ఏడున్నర గంటలు.

హరిహర కళాభవన్ ఆడిటోరియం - నిండా వేలమంది జనం

"వ్యవస్థగా మారిన ఒక వ్యక్తి...మౌళి సార్....పదవీ విరమణ సత్కారసభ." కాంతులు విరజిమ్ముతున్న వేదికపై మౌళి దంపతులకు వేలాదిమంది విద్యార్థుల ఆత్మీయ సత్కారం జరుగుతోంది..పూలమాలలు...శాలువాలు, సన్మానపత్రాలు, మీడియా కెమెరాల ఫ్లాష్ లైట్లు...ఆరోజు దినపత్రికల నిండా పేజీలకు పేజీలు అభినందనల ప్రకటనలు..ప్రత్యేక సంచికలు-

ఆహ్వాన సంఘ కన్వీనర్ ఒక విద్యార్థి మైక్‌లో గంభీరంగా... సభ ముగింపులో చెబుతున్నాడు.

"ఎందరో వేలమంది విద్యార్థులను ఇంజనీర్లుగా తీర్చిదిద్ది, కార్పొరేట్ స్థాయిలో కోట్లకు కోట్ల రూపాయలను సంపాదిస్తున్న నావంటి ఎందరో వారిని తయారుచేసి ఈ దేశానికి ప్రసాదించిన మౌళి సార్‌ను ఈ విశిష్ఠ సందర్భంగా మా విద్యార్థులందరి తరపున ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. సార్ దీనికి ఉచితరీతిలో సమాధానం చెప్తారని మాకు తెలుసు"..అని ఒక్క క్షణమాగి సార్ ముఖంలోకి చూచి నవ్వి "సర్... ఒకప్పుడు మీరు మాకు క్లాస్‌లో చెప్పారు. ఎవరి దగ్గరో ఉద్యోగం జేయడం కాదు...మీరే ఉద్యోగం యిచ్చే వ్యక్తిగా ఎందుకు ఎదగరని. డిపెండెంట్‌గా వద్దు - ఇండిపెండెట్‌గా ఆలోచించమన్నారు మీరు. ఆ ఒక్క వాక్యాన్ని ఊపిరిగా చేసుకుని నేను ఒక సంస్థను స్థాపించాను. యిప్పుడు నా ఆదాయం సంవత్సరానికి నాలుగు కోట్ల రూపాయలు. నాలాంటి యితర మీ విద్యార్థులు యింకెందరో ఉన్నారు. వాళ్ళూ లక్షలూ, కోట్లలో సంపాదిస్తూ ఆర్థికంగా సుస్థిరతను సాధించారు. డబ్బు గురించి ఒకసారి మీరే చెప్పారు. డబ్బును సంపాదించే మార్గం తెలుసుకోవడం కష్టం - కాని ఒకసారి దారి తెలుస్తే యిక పరుగు సులువని అన్నారు మీరు. ఐతే డబ్బును నిజాయితీగా సంపాదించమని కూడా మీరు మాకు లక్ష్మణరేఖను గీశారు. మేము ఆ పరిధిలోనే ఉన్నాము. ఒక చాలెంజ్‌ను మా ముందు విసిరారు. ఐతే... డబ్బు సంపాదించే క్రమశిక్షణాయుతమైన ఎన్నో మార్గాలు మాకు బోధించిన మీరు మాత్రం ఒక సాధారణ ఆర్థికస్థాయి నుండి ఉన్నతస్థితికి రాలేకపోయారు. మీరు కూడా మావలె ఎంతో డబ్బు సంపాదించకుండా ఉన్నచోటనే ఉండిపోయారు. ఎందుకు.

ఈ దిశలో మీ ప్రతిస్పందన ఏమిటి.."

చప్పట్లు....సముద్రకెరటాలు విరిగిపడ్డట్టు చప్పట్లు.

మరుక్షణం..నిశ్శబ్దం...గాఢ నిశ్శబ్దం.

కార్డ్‌లెస్ మైక్రోఫోన్‌ను మౌళిసార్‌కు అందించాడా విద్యార్థి. విలేఖరులు, మీడియా సమాయత్తమైంది జవాబును నమోదు జేయడానికి.

మౌళిగారు గంభీరంగా చెప్పడం ప్రారంభించారు.." జీవితాన్ని ఒక చాలెంజ్‌గా స్వీకరించే క్రమంలో క్రమశిక్షణతో, నిబద్ధతలో డబ్బును గుట్టలు గుట్టలుగా నిజాయితీతో ఎలా సంపాదించవచ్చునో మీకు చెప్పాను నేను. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి వంటి ఎందరినో తయారుచేశాను. ఈ రోజు నేను చెప్పిన రీతిలో మీరు డబ్బు సంపాదిస్తున్నారు. అందుకు నేను ఎంతగానో గర్విస్తున్నాను. అంటే నేను నా ప్రయత్నంలో సంపూర్ణ విజయం సాధించినట్టు లెఖ్ఖ. ఐతే నా జీవితలక్ష్యం మీ వలె డబ్బు సంపాదించడం కాదు. నిజాయితీగా, నైతిక విలువలకు కట్టుబడి డబ్బు సంపాదించగలిగే మీవంటి ఒకతరాన్ని తయారుచేయడం.అందుకోసమే నేను పవిత్రమైన అధ్యాపక వృత్తిని ఎన్నుకున్నాను కావాలని...ఐతే...యిప్పుడు అత్యంత రహస్యమైన చివరి పాఠం మీకు బోధించాలనుకుంటున్నానీ సందర్భంగా..." అని..ఓ క్షణమాగి.,

స్పెల్ బౌండ్...అంతా గంభీర నిశ్శబ్దం...బంగారు వెలుగుల నిగనిగల్లో...వేలమంది ముఖాలు.,

"నిజానికి...ఈ దేశంలో ఏ పౌరునికైనా యింత సంపాదన అవసరంలేదు. ఒక సర్వే ప్రకారం ఒక్క హైద్రాబాద్ నగరంలోనే రోజుకు లక్షరూపాయలు సంపాదించేవారి సంఖ్య లక్షమందిదాకా వుంది. డబ్బు ఉన్నచోటనే గుట్టలు గుట్టలుగా పోగుపడ్తోంది. భారతపౌరులందరికి చెందవలసిన సంపద కొందరిదగ్గరే బందీ ఔతోంది. సంపాదనపరుల్లో తొంబైశాతం పైగా అంతా అవినీతితోనే డబ్బు సంపాదిస్తున్నారు. మిగిలిన నిజాయితీగలిగిన మీవంటి సంపాదనపరులైనా మీ ప్రక్కనే ఈ దేశంలో తిండికోసం అల్లాడుతున్న కోట్లమంది అన్నార్తులవైపు చూడడంలేదు. దయచేసి మీ చూపును ఈ అభాగ్యులవైపు మరల్చండి. వాళ్ళ దీనస్థితిని గమనించండి. ఒక్కసారి ఈ దేశపు అడవుల్లోకి చూడండి. లక్షలాదిమంది గిరిజనులు, ఆదివాసీలు నిరక్షరాస్యులుగా, కనీస వసతులుకూడా లేకుండా అనారోగ్యంతో, అవిద్యతో, అగమ్యమైన భవిష్యత్తుతో అలమటిస్తున్నారు. ఒకసారి మీ చూపును విస్తృతపరచి వాళ్ళను గమనించండి. మీరు మీకు కావలసిన కనీస సంపాదనను మీకోసం ఉంచుకుని మిగతా డబ్బును ఈ సమాజంకోసం, ఈ దేశం కోసం, ఈ పేదలకోసం కేటాయించండి.

ఈ సృష్టిలో ఏదైనా..నది, చెట్టు, పర్వతం, పశువు, పక్షి... దేన్నయినా బాగా గమనించండి..అన్నీ మనకు ఏదో ఒకటి యిస్తూనే ఉన్నాయి.

మనకు దానం చేస్తున్నాయి. ప్రతిగా ఏమీ తీసుకోవడంలేదు...యివ్వడంలో ఉన్న అద్భుతమైన తృప్తి...ఒకసారి యివ్వడం ప్రారంభిస్తేగాని అర్థంగాదు ఎవరికైనా...వేరేవాళ్ళకు మీరు యివ్వడం నేర్చుకోండి...."

జ్ఞాన వినిమయం జరుగుతూనే ఉంది.

అకస్మాత్తుగా బయట...వర్షం మొదలైంది...సన్నగా...తుంపర తుంపరగా..

●

'స్వాతి' వారపత్రిక
తేది : 16.08.2007